■ కథ

# పరిమళ డాట్‌కామ్

లక్ష్మీనారాయణ



రాయి తగిలింది, స్పర్శకంటిన రక్తం అది నాదేనా... వేలుకు దెబ్బ తగిలిందా, అయితే తల బొప్పి కట్టిందే, అలాగే మరో తన్ను తన్ని ఈ గండం నుంచి బయటపడితే... ఈ... అయితే... గియితేలు తెముల్తాయా, అయినా సరే, ఏదో ఒకటి చేయాలి. అవును, ఏదైనా సరే చేయకపోతే కుసుమ దక్కదు గాక దక్కదు, కమ్ సే కమ్ వంద, ఆఫ్టాల్ వంద... అవును వందే... వందే మాతరం... మాతరం వందే...

ఆకాశం రంగు మారుతి ఎదురుగా 'మాలవీయ' అన్నపేరు విండ్ స్క్రీన్ మీద బంగారు రంగులో... ఈ పేరు ఎక్కడో విన్నట్లుందే విన్నట్లుందా... చూసినట్టు... అదే... చదివినట్టులేదూ... ఆc... మరే... దార్లోనే కదా... ఏదో షామియానా... ఎన్నారై... మహా ఇండస్ట్రియలిస్ట్... అవ్యుత్సాహిక రచయితల, రచయిత్రుల కర్మాగారం... చీఫ్‌ప్రమోటర్ ఇంతకూ, చూపుడు వేలిని ముందుకు వంచి బొటనవేలితో... శబ్ద రహితంగా... నాసామి రంగా... కళ్ళ ముందు వందసంగతి... మార్తాండుని ముందు దివిటీ... అదే... మన తక్షణ కర్తవ్యం, వంద... వంద... అర్థమ యిందా... కుసుమ... వంద... "ఆఫ్టాల్ వంద నన్నడిగితే ఇచ్చేదాన్నిగా... అసలు బీదవాళ్ళకు పెద్దచదువెందుకట..."కాలేజీలో టెర్మ్ ఫీజు కోసం ఆఖరుతేదీ వరకూ ప్రయత్నించినా, కట్టలేకపోతే... నేను వినేలా అన్నది ఎవరది... పరిమళ...కునేగా పరిమళ... ఆమె కంటే ముందు విఐపీల ముందు ఎస్కార్ట్‌లా... కునేగా పరిమళం... ఆ తరువాతే... ప్రీమియర్ పద్మిని... ఆకాశం రంగు సిరా వొలికినట్లుగా... అప్పుడు కదా...వీణను తలకిందులుగా నిలబెట్టినట్లు... పరిమళ గాజుల సవ్వడి... ననుసరించి కాలిపట్టా మువ్వలు ముంగిట లేడిపిల్లలా... నెమలి హొయలులా... నెమలి... లేడిపిల్ల... విచిత్రమైన కలగలపు... ఇప్పుడు కదా లింకు దొరికింది... ఈ మాలవీయ కూతురు... పరిమళ... కరెక్ట్...

వెనక్కు... వెనక్కు... వెనెకెనక్కు... ఆ కాలవ గట్టూ, నాకళ్ళలో వీధిలైట్ల కాంతి గీతలుగా... గీతలుగా... మౌనంగా... నిలువెత్తున ఇసుకదిబ్బలు... అవతలి గట్టుమీంచి ముందు నీళ్ళల్లోనూ, ఆ తరువాత గట్టుమీంచి కనిపించే తెల్లమేడ పారిజాతంలా... అది ఈ మాలవీయదే కదా... అవును ఏదీ ఆ మెరూన్ కలర్ ఫియట్... పరిమళ.. కునేగా పరిమళం... పరవశం...

సదస్సు... సందోహం... సదస్సుల వర్చస్యులు... వివరాలు... సదస్సులతో నజరానాల కాఫీసెషన్స్... సదస్సు... జనం... నగరవిహారం... విహంగాల రెక్కలకు కట్టిన కెమరా కళ్ళల్లాంటి కంటద్దాలు... సుకుమారాల... సౌకుమార్యాలు... అందాల ఆస్వాదన... దాహం... ఎవరిదీ... ఆ వీర ఉద్ఘాటన మర్దనా సమర్థుడు...

> సదస్సు తర్వాత అరగంట విరామం... ఈ పోటీలో బహుమతొస్తే... తక్షణం యిస్తారా? మెనీ థౌజెండ్ డాలర్ ప్రశ్న కానేకాదు. కేవలం వంద... వంద రూపాయల ప్రశ్న...

పద... చక్షుల్లారా... మస్తకాల కుక్షి నిండకపోయినా... వంద సంగతేమిటట... వివేకమా వర్థిల్లు, ఠంగ్, మానవత్వమా ప్రవర్థిల్లు... ఠంగ్... ఠంగ్ కుసుమ ఎలా వుందో... ఎలావుంటే అస్సలు బాగుండదో అచ్చం అలానే... వద్దు... కుసుమ ఏడవకూడదు..." నేను లేకపోతే నువ్వు బతగ్గలవేమో కానీ... నీవు లేకపోతే నేను బతకలేనని..." అమాయకంగా వొప్పేసుకున్న... కుసుమకెలాగుందో... ఎలా వంద... కేవలం వంద కోసమని... సమయంతో పరుగు.. సూర్య హాయ వేగాయాసం... భూమండలం ప్రదక్షణం... పరమ పుణ్యధామం... మిగిలింది. కేవలం ఆయాసం... అర్థంలేని కోపాయాసం...

అసహ్యం...గా... నా మీద... నాకే... త్వూ... ఛీ..

ఆగు... ఏదో ప్రకటన, సదస్సు తర్వాత అరగంట విరామం... ఈ పోటీలో బహుమతొస్తే... తక్షణం యిస్తారా? మెనీ థౌజెండ్ డాలర్ ప్రశ్న కానేకాదు. కేవలం వంద... వంద రూపాయల ప్రశ్న... సమస్య సహస్ర మీమాంసల సామూహికం వయస్యా... అవధరింపుము... అడిగెయ్యాలి, కడిగెయ్యాలి. సంతోషం యిక్కడినుంచి నిష్క్రమించాలి. వద్దు ఏ పుట్టలో ఏ పాముందో. కాదు...

కుసుమ... పాపం... పాపమేమిటి... పుణ్యమేమిటి... కాలం కలిసి రాకపోతే... తాడు... నూటతొంభైఆరునెలల సహవాసం. "ఆc ... వనవాసం"... ఏమైనా సరే... వంద... భోజన విరామం... పద... పదండి తోసుకు... పదండిముందుకు ... జొరబడు... ఆ సందోహంలోకి త్వరపడు... "చిన్నినా పొట్టకు..." ఆగు... అక్కడ కుసుమ... హబ్బా! నీ మాట వినడం వలనే కదా యిన్నిన్ని కష్టాలు. ఇంక శీఘ్రం వాయ్‌ముడు... వొరే వొరే నిమిషం... అన్యాయం... నన్ను... నన్ను.. వొరే అంటున్నావ్...

లేదురా... కన్నా... ఒకే ఒక్క నిమిషం మరి అంతకు ముందు... ముద్దుగా.. ఉండుండు... ఏదో ప్రకటన... విషయ ప్రకటన... నిశ్శబ్దం వాడు... వాడు... పరాంకుశం కదూ... ఏమిటీ అవతారం... అడిగేద్దామా... ముందుకు... అడుగేద్దామా... సంశయం సదస్సంశయం విషయం ముందు పావుగంట ఆలోచనకట... ఏమిటా విషయం... చాలా పరమ లౌక్యం... అంతా ముందే నిర్ణయమయి పోయిందట... ష్! లౌక్యం! ఆలోచనా సమయం మరి వంద... నా బొంద... కుసుమ నీ మీద నమ్మకంతో... ఆశతో..

పేపర్లు... తెల్లకాయితాలు... పెన్ ఫోల్డరు చాలా షోగ్గా... ఏమిటా సువాసన... అవును... కునేగా... స్ప్రే చేసినట్టున్నారు... షామియానా... అంతా... కునేగా... పరిమళం... ఇంతకూ పరిమళ వచ్చిందా... ఎన్నారై బాబుతో... తను కూడా ఎన్నారై కాదా! జన్మ భూమికి... దేశభక్తి... మహాప్రభో క్షమించండి... సందేహం నివృత్తయింది.

ఏమిటట రాయమంటున్నారు... అరగంట టైములో... క్రియేటివిటీకి మసిగీతలా... అవి అంచులా... పరాంకుశం ఆలోచనల మాలికలా... సోకులెందుకు... అతని ఆలోచనల పీలికలా... బాగుంది.

ఏమిటీ ఆలోచిస్తున్నారు... రాయండి అప్పుడే అయిదారు నిముషాలు ఖతమయ్యాయి ప్ప్!... మన ఇండియన్స్‌కి టైంసెన్సు ఎప్పటికి తెలుస్తుందో...

అయిపోయింది... మరి ఫెయిర్ చెయొద్దూ, అవసరం లేదు. మీ చేతి రాత బాగుంది. కరెక్ట్... తల రాతే బాగుండలేదు.

"మీ చేతి రాత బాగుంది. అచ్చం అలానే అంది. పరీక్షల ముందర నా నోట్సంతా 'తను' తీసుకెళ్ళి, ఆ తర్వాత ఎక్కడో పోయిందని చెప్పింది. పరిమళ... కాయితప్పూల కంటిన పరిమళం.

కుసుమకెలా వుందో... గంటయిపోయింది. కుసుమ నా ప్రాణం... అవును... ప్రాణంతో చెలగాటం... కాలంతో రణం... కాలహరణం...

ఎవరది... నన్ను గమనిస్తున్నాయని... అడిగెయ్యాలి... ఏమయ్యా మార్తాండతేజా... నేను మీకు తెలుసా... లేక మిమ్మల్ని మీరు నాలో.. నాలో లోపలికి... శోధిస్తున్నారా... ఏమన్నా బాగుందా?

ఏమిటా మాటలు... వాళ్ళతో చెప్పెయ్యాలి... తప్పదు... అడగవద్దని. 'రండి బాబాయి పోదాం" ఆ ముసలి తండ్రితో... సంధ్యా...!

దెబ్బ తగిలిన కాలునొప్పి... దెబ్బతిన్న ఆ వృద్ధుని గుండెలో చెప్పలేని అలజడి... చేతిలో తెల్ల కాయితాలు. పెన్ బ్యూరోక్రసికి అంటించిన 'అర్జెంటా ర్డనరీ' లేబుల్స్‌లా నా చేయి వెనకాల... పరిమళా ఎన్‌క్లేవ్... సౌజన్యం... ఫోల్డరు... కునేగా... వద్దు .., బయట పడాలి... వెళ్ళిపోవాలి... కుసుమ... కు..సు..మ...

"సార్, ఎడ్రసు రాయడం మరచిపోయారు," వెనక నుంచి పరాంకుశం.

ఇంకానయం గుర్తుపట్టలేదు...

నీ... మొహం... గుర్తుపట్టలేదని కదా... నీ వనుకుంటున్నది... వాడు... గోమాయువు... తెలుసు... వాడికి, ప్రస్తుతం నీ వల్ల ఏం లాభం లేదని... లాభం లేకుండా వాడు ఏ పనీ చేయడు గాక చేయడు...

లక్షకు ఎన్ని వందలట... నా బొంద వక్కటంటే వక్కటే... వంద...

ఆఫ్ట్రాల్... వంద... నన్నడిగితే... ఇచ్చేదాన్ని కదా...! హంటింగ్... ఛెళ్ళు... హంటర్...ఛళ్ళు... చెళ్

నీడలు... వెంటాడే... సీ...ఎ... నొప్పి వెన్నులో నొప్పి...

నేలతో నీడ అన్నది... ఎక్కణ్ణించి... కాలునొప్పి, కలతనొప్పి ముల్లులాంటి పరిమళ నొప్పి తలనొప్పి ముక్కు పుడక వొంటిరాయి ఎర్రగా ఎర్రెర్రగా నా గుండె నెత్తుటిలో ముంచి తీసిన ముక్కు పుడక.

కుసుమ, కు...సు...మ కోమల పున్నాగ పూల నీలలోహిత పత్రహరిత ప్రమాణాల పరిణామాల కొలతలు. ప్రమాణాలు... నెలతలు... సెలవేసిన... పూల... లోతుగుండెల...కలతలు. కలలు రేపే... కన్నీటి సుడులు. కవితలు. గంటెంతయింది. పదకొండూ ముక్కాలు అంటే ఏమో ఇంకెంత దూరం నడక నడత నొప్పి కాలునొప్పి సెప్టిక్కవుతుందా!

చలిలో గాలిలో వానలో చీకటి పిల్లి కప్పుకున్న అవనిలా రగ్గులో అయిసుముక్కలా చీమ వెంట చీమ అట్టకట్టిన నెత్తురు కళ్ళకింద ఆరినచారిక వెంబడి బారులు తీరిన తీరు కన్నీళ్ళ చారికల చాళ్ళల్లో బారులు తీరిన చీమలు ఆహారం పదికోట్ల జీవులకూ ఆత్మ ఒక్కడే పరమాత్మ ఒక్కడే నవరంధ్రాల తోలుతిత్తి యిది చందన చర్చిత నీలకళేబర... నవ్వొస్తోంది. ఏడవాలి. భుజం నొప్పి, కాలునొప్పి కడుపులో ఆకలి నొప్పి, కుసుమ నొప్పి, గుండెలో కునేగా స్పర్శ నొప్పి

కల్మషాన్ని కప్పుకుని బుద్ధుడూ

నమ్మకాన్ని చుట్టుకుని ఏక్‌తారాతాత

అసమర్థత తలదించుకుంటూ "పిటీ" నమ్మకాన్ని నమ్మకంగా... నమ్మిన 'అనాధ' అవిటితనం పరచుకున్న రహదారుల్లా అనుబంధం, ఆప్యాయతా అంతా మాయ పెనుమాయ, వంద వుంటే కుసుమ బతికేదా... తాను బతుకుతానంటే వందతెస్తావా? విత్తు ముందా చెట్టుముందా? చింతన చిరంతన చింతనాతనం తనంతతను కంపన ప్రకంపన గుండె ఆడుతోందా భ్రమ అవును భ్రమా! పూర్తయింది. సంధ్యాంధకారాంబుధిలో వివశుణ్ణయి నేనే నే...నే... నేనేనే...నేనేనా!!!

జీవికి ముందు ప్రశ్న వెనక ప్రశ్న వర్తమానం ప్రశ్న, ప్రశ్నోత్తరం శూన్యం మహాశూన్యం... పరమశూన్యం. మెగా శూన్యం అందామా... యమా శూన్యం అనొద్దూ...!

బుద్ధం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి...
హర హర మహాదేవా...


అర్థరహిత వర్తమానం నగర సుందరి నుదుటి మీద అద్దిన తనూలతికలా... కాలపు తునక... చెమ్మగిల్లిన నయనం... ఆర్తి... నోరెండిన... కన్నీరింకిన నయనం... పొడిగా గాలి... వడగాడుపులా... ఆవిరి... గుండెల్లో కడుపులో... వొంటిలో... పెనుమంటలు... ఆకలి. ఆ..క..లి!

శంభో... ఎవరది...ఖాకీ... ఏం లేదు బ్రదర్ ఎడం చేతి రెండ వేళ్ళ ప్రకటన క్రీనీడ వంకరగా నవ్వుతూ... లాఠీగయే!

రేపు తెలుస్తుందిరా పోలీసు వెంకటసామీ
అనాధ ప్రేత సంస్కారార్థం
రాదారి పడవ మజిలీలల్లో మరో మజిలీ...

అర్థరహిత వర్తమానం నగర సుందరి నుదుటి మీద అద్దిన తనూలతికలా... కాలపు తునక... చెమ్మగిల్లిన నయనం... ఆర్తి... నోరెండిన... కన్నీరింకిన నయనం... పొడిగా గాలి... వడగాడుపులా... ఆవిరి... గుండెల్లో కడుపులో... వొంటిలో... పెనుమంటలు... ఆకలి. ఆ..క..లి!

సారూ! మీ కుత్తరం పార్సెల్లూ... విరామ చిహ్నె లెరుగని పిలుపు... మొన్నటికి మొన్న నువ్వేకదా నాయనా... రెండ్రూపాయల 'డ్యూ'కి డబ్బుల్లేకపోతే... తూర్పార బట్టావ్... సుఖం... సంతోషం దుఃఖం... నిర్లిప్తత... కలగలసిన తుంపర... తుంపర... విరిపూల... మీంచి నివురు




గాలుల జోలలు...

ఎవరదీ...పరాంకుశమా...ఎందుకూ ఆ తెచ్చిపెట్టుకున్న అణుకువ... ఏమిటీ నటన... నయవంచన... జాకాల్... మరా రోజు నన్నెరగనట్టు పరాకుగా...

నిన్ను పట్టుకోవడం చాలా కష్టమయి పోయింది. వారం క్రితం వచ్చారు వాళ్లు... నిన్ను కలవాలి... పద ఏర్ పోర్ట్‌కి... ఇంకో గంటలో... వెళ్ళిపోతారు.

నన్ను కలవడం ఏమిటసలు?ఎవరికా కలేజా వుంది...

నా మీద కోపం వుంచుకోకు బ్రదర్... నీ క్లాస్‌మేట్ నని చెప్పుకోవడం కన్నా పరిమళ 'క్లాసే'నని చెప్పుకోవడం గొప్పని భావించాను... ఇప్పుడు తెలిసిందిరా... బాబూ... ఆటో పద... ఏర్‌పోర్ట్.

"సంతోషం... మిమ్మల్ని కలుసుకోవడం"

"ఆఁ నాకూ సంతోషం..."

"మీరు ఏ మౌత్‌వాష్ వాడతారు"

ప్చ్! మీ మూడ్ బావున్నట్టులేదు. మిగతా సంగతులు పరాంకుశం చెప్తాడు. మీరు కాదనకూడదు.

మీరే మా ఫోర్త్ కమింగ్ హైలీ అప్డేటెడ్ వెర్షన్ వెబ్‌సైట్‌కి రెసిడెంట్ ఇంచార్జి... మరో రెండు నెలల్లో... వచ్చి మరింత వివరంగా... మాట్లాడుకుందాం..."

ఏం పరాంకుశం... అందాకా... వీరిని.. మహాభాగ్యం... పరిమళ భరితం...

అవునూ..పరిమళ..

సారీ.. క్రాష్ లాండింగ్

గాలిలో కలసిన పరిమళం...

తను, గుండెకరిగితను, మరి గుండె పగిలిన పిగిలిన మనస్సుతో... నిలబడగా... గాలిలోకి... కుడి చెయ్యి... అప్రమత్తంగా... కునేగా... కు...నే...గా... బుగ్గలపై జారిన... జ్ఞాపకంలా... కు...! ●

రూ. 21,00,000/-ల విలువగల బహుమతులు గెలవండి - ఎంట్రీఫీజు లేదు

| ఉదాహరణ | | |
|---|---|---|
| 4 | 9 | 8 |
| 11 | 7 | 3 |
| 6 | 5 | 10 |

1వ బహుమతులు - టాటాసుమో - (ఇద్దరికి)
2వ బహుమతులు - హీరోహోండా, (ఎనిమిది మందికి)
కన్సొలేషన్ బహుమతులు - వెస్పాస్కూటర్, సి.డి.ప్లేయర్, కలర్ టి.వి., ఆటోమేటిక్ కెమెరా, ఎయిర్‌కూలర్, వాషింగ్ మెషిన్, టు-ఇన్-వన్ (పథకం MB&HP క్రింద)

| | | |
|---|---|---|
| 5 | | |
| | 8 | |
| | | 11 |

★ మొదటి 200 సరైన ఎంట్రీలకు ఒక్కొక్కరికి 4 గ్రాముల ఒక బంగారు నాణెం

★ పైన తెలిపిన విధంగా, తెల్లకాగితం మీద లేదా ఇన్‌లాండ్ లెటర్‌పై లేదా పోస్టుకార్డుపై 9 ఖాళీ చతురస్రాలు గీయండి. 4 నుంచి 12 అంకెలు వాడుతూ ఏ కోణం నుంచి కూడినా 24 వచ్చేలా చూడండి. ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి.. మీ ఎంట్రీలు సాధారణ పోస్టులో 15 రోజుల్లోగా చేరాలి. వెంటనే వ్రాయండి, ఆలస్యం చేయకండి.

Add:- MANISH BHAVAN,A-1, P.O. Lal Bigha (GAYA)

Publisher is not responsible for any disputes in this regard